
RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 164 | మే 24, 2025 | వెల : రూ.3-00



నకిలీ విత్తనాలు అమ్మితే పీడీయాక్ట్

3లో..



# కేంద్రంతో కలిసి పని చేస్తా..

- కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేస్తేనే అభివృద్ధి
- ఆదర్శవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దే వరకు విశ్రమించేది లేదు: సీఎం

**వేద న్యూస్, సంగారెడ్డి ప్రతినిధి:**

సామాజిక న్యాయం, సమాన అవకాశాలతో తెలంగాణను ప్రపంచంలోనే ఒక గొప్ప ఆదర్శవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దే వరకు విశ్రమించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను ఒక అద్భుతమైన నగరంగా అభివృద్ధి చేసి ప్రజలకు అంకితం చేసే వరకు నిద్రపోనని, అందుకు అండగా నిలబడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. జహీరాబాద్ నిమ్జ్ కోసం భూ సేకరణలో భాగంగా భూములు కోల్పోయిన 5,612 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కి ఆదేశాలిచ్చారు. గత పదేళ్ల కాలంలో జహీరాబాద్ నిమ్జ్ పూర్తిగా కుంటుపడిందని చెబుతూ,



ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిమ్జ్ భూ నిర్వాసితులకు నష్టపరిహారం పెంచి భూ సేకరణను వేగవంతం చేశామన్నారు. హ్యూందయ్ సంస్థ త్వరలోనే ఇక్కడ కార్యకలాపాలను ప్రారంభించనుందన్న శుభవార్తను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలిపారు. రైతులంతా కలిసి సహకార వ్యవస్థను ఏర్పాటు చేసుకుని నడిపిస్తామంటే చెక్కర కర్మాగారం ఏర్పాటుకు నిమ్జ్‌లో వంద ఎకరాలు కేటాయించి అందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామన్నారు. జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని, ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు అని ఆ తర్వాత అభివృద్ధి విషయంలో అందరినీ కలుపుకుని పనిచేస్తామని, అభివృద్ధి, రాష్ట్రానికి రావలసిన నిధుల విషయంలో ఎన్నిసార్లయినా ప్రధానమంత్రి మోదీని కలుస్తానని పునరుద్ఘాటించారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ

మిగతా 4వ పేజీలో..



# ఖాకీల అదుపులో మోసగాడు


- వేద న్యూస్ వార్తా కథనానికి స్పందన
- 'కలెక్టర్ సంతకం ఫోర్జరీ'పై ఇంటెలిజెన్స్ వర్గాల ఆరా

**వేద న్యూస్, వరంగల్ జిల్లా:**




ఉద్యోగం ఇప్పిస్తానని జనం అమాయకత్వాన్ని పెట్టుబడిగా మార్చు కొని ఏకంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంతకంతో ఫేక్ అపాయింట్ మెంట్ కాపీ ఇచ్చాడు ఓ ఘనుడు. ఇప్పుడు ఆ మోసగాడు సుబేదారి పోలీస్ అదుపులో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. పూర్తి వివరాల్లోకెళితే వరంగల్ నగరం వ్యాప్తంగా ఓ మోసగాడు నగరంలోని నిరుద్యోగులను టార్గెట్ చేసుకొని తమకు వరంగల్ కలెక్టరేట్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి సుమారు 30 మంది వద్ద రూ.25 వేల చొప్పున వసూలు చేసి ఏకంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఫేక్ సంతకంతో ఫేక్ అపార్ట్మెంట్ కాపీలు ఇచ్చాడు. ఈనెల 21న ఉద్యోగంలో జాయిన్ కావచ్చు అని చెప్పడంతో ఉద్యోగం వచ్చిందన్న సంతోషంలో వరంగల్ కలెక్టరేట్‌కు వెళ్లిన నిరుద్యోగులకు నిరాశ మిగిలింది.నియామక పత్రాలను చూసిన అక్కడి సిబ్బంది అవి నకిలీ నియామక పత్రాలని తేల్చి చెప్పారు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు కంగుతిన్నారు. వెంటనే అందులో ఓ బాధితుడు 'వేద న్యూస్' తెలుగు దినపత్రిక ప్రతినిధిని ఆశ్రయించాడు. తనకు జరిగిన అన్యాయాన్ని వెల్లడించారు. విషయం తెలుసుకున్న 'వేద న్యూస్' ప్రతినిధి పూర్తిస్థాయిలో ఆధారాలు సేకరించి

మిగతా 4వ పేజీలో..



# నేడు పాలిసెట్ ఫలితాలు

**వేద న్యూస్, హైదరాబాద్ :**

మే 13న నిర్వహించిన పాలిసెట్ పరీక్ష ఫలితాలను నేడు (శనివారం) ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు తెలంగాణ సాంకేతిక విద్య, శిక్షణ-ఎస్బీటెట్ కార్యదర్శి బి. శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్లోని సాంకేతిక విద్యాభవన్‌లో ఈ ఫలితాలు విడుదల చేయనున్నట్లు తెలిపారు. పాలిసెట్-2025కు 92.64 శాతం మంది హాజరయ్యారు. దీనికి మొత్తం 1,06,716 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 98,858 మంది పరీక్ష రాశారు. ఈ పాలిసెట్ ద్వారా తెలంగాణలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్లను భర్తీ చేస్తారు.

# మహిళా సాధికారితే బీజేపీ లక్ష్యం

- బీజేపీకి అనూహ్యంగా పెరుగుతున్న మహిళల మద్దతు
- బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**



వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గంలోని బిజెపి సీనియర్ నాయకులు అల్లి అజయ్ ఆధ్వర్యంలో బిజెపి చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మహిళలకు బిజెపి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అనంతరం వారు మాట్లాడుతూ..ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం మహిళలకు పట్టాంకట్టింది అని వారి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుంది అని అన్నారు. అందుకోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టింది అని వాటిని ఉపయోగించుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలియజేశారు. బీజేపీ నినాదం 'సబ్ కే సాత్..సబ్ కా వికాస్' అని పార్టీలో కుల మతాలకు తావు లేదని స్పష్టం చేశారు. బిజెపి సిద్ధాంతాలు నచ్చి 19వ డివిజన్ సొసైటీ కాలనీలోని మహిళలు పార్టీ లో చేరారని, గత పది సంవత్సరాల నుండి వరంగల్ తూర్పు నియోజకవర్గంలో సమస్యలు పాలకులు గాలికి వదిలేశారని ఆరోపించారు. నాటి ఎమ్మెల్యేలు, నేటి మంత్రి ఉన్నా ఏరోజు ప్రజాసమస్యలను, అభివృద్ధిని పట్టించుకోక పోవడం లేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న పథకాలు, రాష్ట్ర ప్రభుత్వం యొక్క వైఫల్యాలు, ఎమ్మెల్యే పనితీరు నచ్చక, వరంగల్ జిల్లా బిజెపి మీద నమ్మకం పై బిజెపిలో పార్టీలో చేరారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకుల రఘునారెడ్డి, కాశీబుగ్గ మండల ప్రధాన కార్యదర్శి రాఘవాచారి, జిల్లా కౌన్సిల్ మెంబర్ గుర్రపు సత్యనారాయణ, బూత్ అధ్యక్షులు ఆడెపు రవిరామ్ తేజ, బ్రహ్మాచారి, బిజెపి మహిళా నాయకురాలు పాల్గొన్నారు.



# యూటీ పనులను పరిశీలించిన మంత్రి పొంగులేటి

**వేద న్యూస్, ఖమ్మం :**

పాలేరు సాగర్ కాలువ వద్ద జరుగుతున్న యూటీ పనులను తెలంగాణ రెవెన్యూ,గృహనిర్మాణ,సమాచార శాఖల పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరిశీలించారు. మంత్రి గత సెప్టెంబర్ 1న వచ్చిన అకాల వరదలకు పాలేరులో సాగర్ కాలువకు గండ్లు పడటంతో యూటీ పూర్తిగా కూలిపోయింది. కాగా మంత్రి పొంగులేటి ఆదేశాల మేరకు అధికారులు పనులు వేగవంతం చేశారు. ఈ సందర్భంగా ఆకస్మాత్తుగా పనుల పరిశీలనకు వచ్చారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి పనులు జరుగుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. పూర్తి వర్షాకాలం వచ్చేసరికి మొత్తం పనులు పూర్తి చేయాలని వచ్చే 15 నుండి 20 రోజుల్లో 24 గంటలు రెండు షిఫ్టు పని జరిగేలా చూడాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.అనంతరం పాలేరులో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు.



# ఉద్యానవన సాగును విస్తృతంగా అభివృద్ధి చేయాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**

వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం నిర్వహించిన ఉద్యానవన శాఖ జిల్లా స్థాయి కమిటీ మీటింగ్ లో కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డిఆర్ఓ విజయలక్ష్మి, జిల్లా హార్టికల్చర్ అధికారిణి సంగీత లక్ష్మి , జే డి అగ్రికల్చర్ అధికారిణి అనురాధ, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, డిఆర్డిఓ పి డి కౌసల్య దేవి పాల్గొని జిల్లాలో సాగు చేసే పండ్లతోటలు, కూరగాయల సాగు విస్తీర్ణం పై సంబంధిత అధికారులు,శాస్త్రవేత్తలు,రైతులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2025- 2026 వార్షిక ప్రణాళిక వివిధ పథకాల ద్వారా రాష్ట్ర స్థాయి నుంచి కేటాయించబడిన

మిగతా 4వ పేజీలో..

# తొమ్మిది నెలల శిశువుకు పాజిటివ్

- దేశంలో మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు
- బెంగళూరులో 9 నెలల బాలుడికి కొవిడ్ నిర్ధారణ
- కేరళలో మే నెలలో 182 కేసులు నమోదు



**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

దేశవ్యాప్తంగా కరోనా మహమ్మారి మరోసారి నెమ్మదిగా పంజా విసురుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. పలు రాష్ట్రాల్లో కొవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా కర్ణాటక, కేరళ వంటి పొరుగు రాష్ట్రాల్లో కొత్త కేసులు వెలుగుచూడటంతో ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ కూడా అప్రమత్తమైంది. కర్ణాటక రాజధాని బెంగళూరులో తొమ్మిది నెలల పసికందుకు కరోనా సోకినట్లు ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. హొస్కోటే ప్రాంతానికి చెందిన ఈ చిన్నారిని అనారోగ్యంతో మొదట ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కలాసిపాల్యలోని వాణి విలాస్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నిర్వహించిన పరీక్షల్లో మే 22న చిన్నారికి కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని కర్ణాటక కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి హర్ష్ గుప్తా తెలిపారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని ఆయన పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రమైన కేరళలోనూ కరోనా కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మే నెలలో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 182 కొత్త ఇన్ఫెక్షన్లు నమోదైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, కొవిడ్ నిబంధనలు పాటించాలని కేరళ ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ హెచ్చరించారు. జిల్లాల వారీగా చూస్తే, కొట్టాయం జిల్లాలో అత్యధికంగా 57 కేసులు నమోదు కాగా, ఎర్నాకుళంలో 34, తిరువనంతపురంలో 30 కేసులు బయటపడ్డాయి.

# భారత సైన్యాన్ని మెచ్చుకున్న అమిత్ షా..

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

దేశ రాజధానిలో జరిగిన 22వ బీఎస్ఎఫ్ పదవి పురస్కార కార్యక్రమానికి హాజరైన కేంద్ర హోం మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ సిందూర్'ను ప్రశంసించారు. ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం, బీఎస్ఎఫ్, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు అద్భుతంగా పనిచేశాయని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఆపరేషన్ విజయవంతమైందన్నారు. గతంలో పాకిస్థాన్ ఆధ్వర్యంలో జరిగిన దాడులకు ఆయా ప్రభుత్వాలు తగిన సమాధానం ఇవ్వలేదని అమిత్ షా విమర్శించారు. కానీ 2014లో నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితి మారిందన్నారు. ఉగ్రవాద దాడులకు గట్టి సమాధానం ఇవ్వడమే కాదు, భారత్ అంటే ప్రపంచానికి తెలిసేలా చేశామన్నారు అమిత్ షా.

# భారీ లాభాలతో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు



**వేద న్యూస్, డెస్క్:**

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈరోజు భారీ లాభాలను నమోదు చేశాయి. నిన్న ఎదురైన తీవ్ర నష్టాల నుంచి సూచీలు ఈరోజు అంతే వేగంగా కోలుకున్నాయి. అమెరికా బాండ్ల రాబడులు తగ్గడం మార్కెట్ సెంటిమెంట్‌కు ఊతమిచ్చింది. ముఖ్యంగా ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఫైనాన్షియల్, బ్యాంకింగ్ రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా మోస్తరు లాభాలను ఆర్జించాయి. ఈరోజు ఉదయం సెన్సెక్స్ 80,897.00 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాలతో ప్రారంభమైంది. క్రితం ముగింపు 80,951.99 పాయింట్లతో పోలిస్తే కొంత తక్కువగా ట్రేడింగ్ మొదలైనప్పటికీ, కొద్దిసేపటికే లాభాల బాట పట్టింది. రోజంతా అదే జోరు కొనసాగించిన సూచీ, ఇంట్రాడేలో ఏకంగా 900 పాయింట్లకు పైగా లాభపడి 81,905.17 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. చివరికి, సెన్సెక్స్ 769.09 పాయింట్ల లాభంతో 81,721.08 వద్ద స్థిరపడింది. మరోవైపు, నిఫ్టీ కూడా 243.45 పాయింట్లు లాభపడి 24,853.15 వద్ద ముగిసింది. దీంతో నిఫ్టీ మళ్లీ 24,800 మార్కు పైకి చేరింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ గణనీయంగా బలపడింది. 72 పైసలు పెరిగి 85.23 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలోని సన్‌ఫార్మా షేరు మినహా మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో పయనించాయి. ముఖ్యంగా ఎటర్నల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఐటీసీ, నెస్లే ఇండియా, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ఎక్కువగా లాభపడిన వాటిలో ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర 64.38 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, బంగారం ఔన్సు ధర 3,327 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది.

# అవమాన భారంతో బాలుడి ఆత్మహత్య..!

**వేద న్యూస్, డెస్క్:**

దొంగతనం చేయకపోయినా తనను దొంగను చేశారని, ఓ కిరాణ దుకాణం యజమాని మాటలు నమ్మి తల్లి కూడా తనను కొట్టిందని ఓ పన్నెండేళ్ల బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పురుగుల మందు తాగి ప్రాణం తీసుకున్నాడు. పశ్చిమబెంగాల్ రాష్ట్రం పశ్చిమ మేదినీపూర్ జిల్లాలోని గోసాయిబర్ బజార్ లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. గోసాయిబర్ బజార్‌కు చెందిన కృష్ణేందు దాస్ (12) చిప్స్ కొనుక్కోవడానికి స్థానికంగా ఉన్న ఓ కిరాణా దుకాణానికి వెళ్లాడు. అక్కడ దుకాణంలో దాని యజమాని శుభాంకర్ దీక్షిత్ లేకపోవడంతో వెనుకాల ఇంట్లో ఉన్నాడేమోనని పలుమార్లు అంకుల్.. అంకుల్ అంటూ పిలిచాడు. అయినా లోపలి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో బాలుడు వెనుదిరిగాడు.

తిరిగి వెళ్తున్న సమయంలో కింద రోడ్డుపై ఒక కుర్‌కురే పాకెట్ కనిపించడంతో తీసుకున్నాడు. బాలుడు కుర్‌కురే తింటూ తన ఇంటివైపు వెళ్లడాన్ని గమనించిన దుకాణం యజమాని అతడిని వెంబడించాడు. బాలుడు ఇంటి ముందు అతడిని పట్టుకుని కొట్టాడు. అక్కడ గుమిగూడిన అందరికీ తన దుకాణంలో వీడు చిప్స్ ప్యాకెట్ దొంగిలించాడని చూపించాడు. వాళ్ల ముందే బాలుడితో బలవంతంగా గుంజీలు తీయించాడు.

తాను చిప్స్ ప్యాకెట్ దొంగిలించలేదని, కింద రోడ్డుపై పడి ఉండటంతో తీసుకుని వచ్చానని చెప్పినా దుకాణదారుడు వినిపించుకోలేదు. ఆ బాలుడి తల్లిని రోడ్డుపైకి పిలిచి 'నీకు కొడుకు నా దుకాణంలో దొంగతనం చేశాడు' అని చెప్పాడు. దాంతో ఆగ్రహించిన ఆమె కూడా బాలుడిని కొట్టింది. అనంతరం తల్లితోపాటు ఇంట్లోకి వెళ్లిన బాలుడు ఓ గదిలోకి వెళ్లి తలుపేసుకున్నాడు. ఆ గదిలో ఉన్న పురుగుల మందు సేవించాడు. అనుమానించిన తల్లి ఎంత పిలిచినా బాలుడు తలుపు తీయకపోవడంతో గట్టిగా ఏడుస్తూ ఇరుగుపొరుగు వారిని పిలిచింది. వాళ్లు తలుపు పగులగొట్టి చూడగా బాలుడు నోట్లోంచి నురుగలు కక్కుతూ స్పృహతప్పి పడిఉన్నాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించారు. బాలుడి గదిలో లభించిన సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. తాను దుకాణంలో దొంగతనం చేయలేదని, షాప్ అంకుల్ లేకపోవడంతో తిరిగివస్తుండగా రోడ్డు పక్కన ఒక కుర్‌కురే ప్యాకెట్ పడి ఉందని, తనకు కుర్‌కురే అంటే చాలా ఇష్టం కాబట్టి అది తీసుకున్నానని, షాప్ అంకుల్ ఆ కుర్‌కురేను షాప్‌లో నుంచి దొంగిలించాననుకుని కొట్టాడని వాళ్ల అమ్మను ఉద్దేశించి నోట్ రాశాడు.

# పెద్దపులిపై ప్రతీకారం

- మనిషిని చంపిందన్న కోపంతో పులిని చంపేసిన గ్రామస్థులు
- పులి కాళ్లు, చెవులు, చర్మం, దంతాలు కోసుకెళ్లిన జనం
- అడ్డుకోబోయిన ముగ్గురు అటవీ అధికారులకు గాయాలు
- పులుల సంరక్షణపై తీవ్ర ఆందోళన, ఈ ఏడాది ఇది మూడో ఘటన



వేద న్యూస్, డెస్క్ :

అసోంలోని గోలాఘాట్ జిల్లాలో అత్యంత దారుణమైన సంఘటన చోటుచేసుకుంది. ఒక వ్యక్తి మృతికి ప్రతీకారంగా వెయ్యి మందికి పైగా గ్రామస్థులు ఏకమై ఒక రాయల్ బెంగాల్ పులిని అత్యంత కిరాతకంగా హతమార్చారు. ఆవేశంతో ఊగిపోయిన జనం, పెద్ద పులిని చంపడమే కాకుండా దాని శరీర భాగాలను కోసుకుని తీసుకెళ్లడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ ఏడాది అసోంలో పులుల మృతికి సంబంధించిన ఘటనలు వెలుగు చూడటం ఇది మూడోసారి కావడంతో వన్యప్రాణి సంరక్షణపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వివరాల్లోకి వెళితే, గోలాఘాట్ జిల్లాలోని దుసుతిముఖ్ గ్రామానికి చెందిన వెయ్యి మందికి పైగా ప్రజలు గురువారం ఈ దారుణానికి ఒడిగట్టారు. సుమారు నెల రోజుల క్రితం సమీప గ్రామంలో ఒక వ్యక్తి పులి దాడిలో మరణించాడని, ఆ పులే తమ పశువులైన పందులు, మేకలను కూడా చంపుతోందని గ్రామస్థులు ఆరోపించారు. దీంతో ఆగ్రహంతో రగిలిపోయిన గ్రామస్థులు, పదునైన ఆయుధాలు, ఇనుప రాడ్లు, కత్తులతో గురువారం ఉదయం సుమారు 6 గంటలకు పులి కోసం వేట ప్రారంభించారు.

ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య, కజిరంగా నేషనల్ పార్క్ మరియు టైగర్ రిజర్వ్ కు సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక అటవీ ప్రాంతంలోకి పులిని తరిమి, దానిపై దాడి చేసి చంపేశారు. సమాచారం అందుకున్న అటవీ, పోలీస్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకునే లోపే గ్రామస్థులు పులిని చుట్టుముట్టి హతమార్చారు. పులి కాళ్లు, చెవులు, చర్మం, దంతాలు, గోళ్లు వంటి శరీర భాగాలను విజయానికి గుర్తుగా కోసుకుని తీసుకెళ్లినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన ముగ్గురు అటవీ శాఖ సిబ్బంది గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గోలాఘాట్ డీఎఫ్ఓ గుణదీప్ దాస్ తెలిపారు. పులి కళేబరానికి వైద్య పరీక్షలు నిర్వహించగా, తుపాకీ కాల్పుల వల్ల కాకుండా పదునైన ఆయుధాలతో దాడి చేయడం వల్లే అది మృతి చెందినట్లు తేలిందని ఆయన వివరించారు. పోస్టుమార్టం అనంతరం పులి అవశేషాలను గోలాఘాట్ రేంజ్ కార్యాలయంలో దహనం చేశారు. ఈ ఘటనపై స్థానిక ఎమ్మెల్యే మృణాల్ సైకియా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ఇది చాలా బాధాకరమైన సంఘటన. ఈ భూమి మనుషులకు మాత్రమే కాదు, జంతువులకు కూడా చెందింది. వన్యప్రాణులకు కూడా జీవించడానికి స్థలం అవసరం" అని ఆయన అన్నారు. మే మొదటి వారం నుంచే ఈ పులి దుసుతిముఖ్ గ్రామ పరిసరాల్లో తిరుగుతున్న విషయం స్థానికులకు తెలుసునని పర్యావరణ కార్యకర్త అపూర్బ బల్లవ్ గోస్వామి తెలిపారు. "మే 4న ఒక స్థానికుడు పులి సంచారం గురించి మాకు సమాచారం ఇచ్చారు, దాని ప్రకారం అటవీ శాఖకు తెలియజేశాం. అటవీ దళాలను మోహరించి, సరైన అప్రమత్తతతో ఉంటే ఈ దారుణ ఘటనను నివారించగలిగేవారు" అని ఆయన అభిప్రాయపడ్డారు. గ్రామస్థులు ముందుగానే పులిని వేటాడేందుకు ఆయుధాలు సిద్ధం చేసుకున్నారని అటవీ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది అసోంలో పులుల మరణాలు ఆందోళనకరంగా పెరిగాయి. ఇంతకుముందు ఓరంగ్ నేషనల్ పార్క్‌లో ఒకటి, బిశ్వనాథ్ వన్యప్రాణి విభాగంలో మరొక పులి కళేబరాలు లభ్యమయ్యాయి. తాజా ఘటనతో పులుల సంరక్షణ చర్యలపై నీలినీడలు కమ్ముకున్నాయి. చనిపోయిన పులి ఎక్కడి నుంచి వచ్చిందో ఇంకా గుర్తించలేదని కేఎన్‌పీటీఆర్ ఫీల్డ్ డైరెక్టర్ సోనాలి ఘోష్ తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోంది.

# మునిగిపోతున్న సైనికుడ్ని కాపాడి.. యువ ఆర్మీ అధికారి మృతి

**వేద న్యూస్, డెస్క్:**

నీటిలో మునిగిపోతున్న సైనికుడ్ని యువ ఆర్మీ అధికారి కాపాడారు. అయితే నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి మరణించారు. యువ అధికారి మరణంపై ఆర్మీ సంతాపం వ్యక్తం చేసింది. సిక్కిం స్కౌట్స్ రెజిమెంట్‌కు చెందిన 23 ఏళ్ల లెఫ్టినెంట్ శశాంక్ తివారీ ఆరు నెలల కిందటే ఆర్మీలో అధికారిగా నియమితుడయ్యారు. గురువారం ఉదయం వ్యూహాత్మక టాక్టికల్ ఆపరేటింగ్ బేస్ (టీవోబీ) వైపు రూట్ ఓపెనింగ్ పెట్రోల్‌లో పాల్గొన్నారు.

కాగా, ఈ సందర్భంగా కర్ర వంతెన దాడుతుండగా అగ్నివీర్ స్టీఫన్ సుబ్బా జారి వాగు నీటిలో పడ్డాడు. నీటి ప్రవాహంలో అతడు కొట్టుకుపోతుండగా లెఫ్టినెంట్ శశాంక్ తివారీ వెంటనే స్పందించారు. ఆ సైనికుడిని రక్షించేందుకు వాగులోకి దూకారు. నాయక్ పుకార్ కటెల్ సహాయంతో అగ్నివీర్‌ను కాపాడి సురక్షితంగా బయటకు తెచ్చారు. మరోవైపు నీటి ప్రవాహం ఉధృతికి లెఫ్టినెంట్ శశాంక్ తివారీ కొట్టుకుపోయారు. పెట్రోలింగ్ బృందం ఆయను రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అరగంట తర్వాత 800 మీటర్ల దూరంలోని దిగువన శశాంక్ తివారీ మృతదేహాన్ని గుర్తించారు. సైనికుడ్ని కాపాడే క్రమంలో ప్రాణాలు కోల్పోయిన యువ అధికారి ధైర్యసాహసాలు, త్యాగాన్ని ఆర్మీ ప్రశంసించింది. శశాంక్ తివారీకి తల్లిదండ్రులు, సోదరి ఉన్నట్లు సంతాప ప్రకటనలో పేర్కొంది.



# సంపాదకీయం

## దేశద్రోహుల భరతం పట్టాలి

జ్యోతి మల్హోత్రా పేరు ఇప్పుడు భారతదేశం అంతటా ప్రతిధ్వనిస్తుంది. ఆకర్షణీయ రూపురేఖలతో, చక్కటి ఉచ్చారణతో, మంచి వాగ్ధాటితో ఎంతటివారినైనా ఇట్టే ఆకర్షించే శక్తిసామర్థ్యాలు గల జ్యోతి మల్హోత్రా, పర్యాటక ప్రాంతాలకు దూసుకెవెళ్లి, వార్తా విశేషాలను కవర్ చేస్తూ వాటిని వీడియోల ద్వారా సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేస్తూ వీక్షకుల మన్ననలు పొందిన ట్రావెల్ యూట్యూబర్‌గా పేరు పొందింది. ఆమె ఇప్పుడు అనేక ఆరోపణలతో చిక్కుల్లోపడింది. ఆమె పాకిస్తానీ నెంబరు 1 గూఢచారిణి అని కొందరు అంటున్నారు. ఈ విషయం తెలిసిందే తడవుగా అందరూ దిగ్భ్రాంతికి గురయ్యారు. పహల్గాం ఉగ్రదాడి తరువాత భారత్ సైనిక ఇంటలిజెన్స్ వర్గాల పరిశోధనా సంస్థలు అనేక విషయాలతోపాటు యూట్యూబర్ల కార్యకలాపాలపై కూడా విచారణ చేశాయి. ఈ సందర్భంగా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా దేశద్రోహ కుట్రల ఆనువాళ్ళ చరిత్ర బయటపడినట్లు తెలుస్తోంది. మనదేశంలో బతుకుతూ తన ట్రావెలర్ యూట్యూబర్ వృత్తిలో భాగంగా అనేక ఆకర్షణీయమైన, కీలకమైన ప్రదేశాలను పర్యటిస్తూ, ముఖ్యమైన కట్టడాల వీడియోలు తీసి పాకిస్తాన్ రాయబార కార్యాలయంలో ముఖ్య అధికారులతో సంబంధాలు పెట్టుకొని, వారితో సంప్రదింపులు జరిపి మన దేశానికి చెందిన కీలక సమాచారం అందించిందని అందులోనూ సైనిక స్థావరాల సమాచారం కూడా ఉందట. ఇందుకు ప్రతిఫలంగా భారీ మొత్తంలో లంచం అందుకుంటూ వస్తుందట. ఇప్పుడు ఈ యూట్యూబర్‌ను భద్రతా బలగాలు తగిన ఆధారాలతో అరెస్టు చేసింది. ఆమెపై ఇంటరాగేషన్ ఇంకా జరుగుతున్నది.ఇంకా సంపూర్ణ సమాచారం వెల్లడి కావాల్సి ఉంది. ఆమెకు ట్రావెల్ విత్ జో అనే పేరుగల యూట్యూబ్ ఛానల్ ఉంది. ఆమె మొదట్లో హర్యానా, పంజాబ్ రాష్ట్రాలలో సంచరించింది. తాను హర్యానా, పంజాబీని అని పరిచయం చేసుకుంది. 33 ఏండ్ల ఈ యూట్యూబర్‌కు ఇప్పటికే 3 లక్షల 85 వేలకు పైగా ఖాతాదార్లు ఉన్నారు. ఆమె పర్యాటక వీడియోలకు ప్రజాదరణ దక్కింది. ఫలితంగా ఆమెలో తక్కువ సమయంలో అధిక ధనం, ఆస్తులు సంపాదించుకోవాలి అనే కోరిక పెరిగింది. దీనితో ఆమె తన వృత్తి ధర్మాన్ని వదిలిపెట్టి దేశంలో కీలక ప్రదేశాలు, కట్టడాలను వీడియోలు తీసి మన శత్రుదేశం పాకిస్తాన్ ఏజెంట్లుకు చేర వేసిందట. ఈ క్రమంలో పలు దేశాలను స్పెషల్ క్లాస్ విమానాల్లో పర్యటించింది. అమెరికా, చైనా, పాకిస్థాన్ వంటి పలు దేశాల్లోని విలాసవంతమైన హెూటళ్లలో ఉంటూ అక్కడ ఉన్న సీక్రెట్ స్థలాలు పర్యటించింది. ఆమె అందం, చురుకుదనం అన్నింటిని చూసి పాక్ సమాచార అధికారులు ఆమెను తమ ఏజెంటుగా వాడుకున్నారని పోలీసులు తెలిపారు. ఆమె తెగువతనం చివరికి ఆమెను ఏజెంటుగా చేసిందని కేసు దర్యాప్తులో ఉన్న ఎస్పి శశాంక్ కుమార్ సావన్ తెలిపారు. ఆమెకు ఉన్నత స్థాయిలో కనెక్షన్లు లేవని, రహస్య సమాచారం తెలిపే సరైన వనరులుకాని, వ్యక్తుల పరిచయాలు కాని లేనని పాక్ రహస్య గూఢవార సంస్థల అధికారులకు కూడా తెలుసు. అయితే ఆమెకున్న చొరవతో ఈ దిశలో ఆమెను తమ కీలక పాత్రధారిగా చేసుకోవచ్చునని నిర్ధారించుకుని ఆమెను రంగంలోకి దింపినట్లు తెలిసింది. పాకిస్తానీ అధికారులను ఏ విధంగా కలిశారనేది కీలక విషయం అయింది.

ఆ దిశగా పరిశోధన సాగుతోంది. ఆపరేషన్ సిందూర్ తరువాత న్యూఢిల్లీలోని పాక్ హైకమిషనర్ కార్యాలయంలో ఆమె పాక్ అధికారి డానిష్ను కలిసింది. అంతకు ముందు ఆమె పలు సార్లు పాకిస్తాన్‌కు వెళ్లిరావడం, చివరికి పహల్గాం ఉగ్రదాడికి ముందు కూడా ఆమె అక్కడ ఓ అతిథి గృహంలో మకాం వేసి ఉండటం వంటి విషయాలను ఇప్పుడు మన ఇంటలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నాయి. ఆమెకు చెందిన పలు ఫోన్లు, యూట్యాబ్లు, ల్యాప్ ట్యాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఆ ఫోన్‌లలో మారు పేర్లతో పాకిస్తాన్ రాయబార కార్యాలయం సిబ్బంది పేర్లు ఉన్నాయట. గత ఏడాది మార్చిలో ఆమె పాకిస్తాన్‌కు వెళ్లి వచ్చింది. పైగా పర్యాటకం మునుగులో ఓ వీడియో వెలువరించింది. అప్పట్లో ఆమె పాకిస్తాన్ పర్యటనలో భాగంగా తీసిన వీడియోలో ఆమె పాకిస్తాన్‌ను అదే పనిగా కొనియాడిందని భద్రతా అధికారులు గుర్తించారు. పాకిస్తాన్‌లో పర్యటించినప్పుడు. ఆమె 2023లో పది రోజుల పాటు పార్టీలు, విందులు, వినోదాలతో విలాసవంతంగా గడిపిందిట. అక్కడ ఆమె బస పర్యటనల బాధ్యతను అక్కడి కీలక వ్యక్తి అలీ ఆహవాన్ చూశారని వెల్లడైంది. దేశంలోని పలు ప్రాంతాలు ఢిల్లీ, కోల్‌కతా, హైదరాబాద్‌లో కూడా ఆమె యూట్యూబర్‌గా పర్యటించినట్లు కొందరు ప్రముఖులతో పరిచ యాలు పెంచుకున్నట్లు వెల్లడైంది. దేశంలో ఇప్పటికీ దాదాపు డజన్ కు పైగా రహస్య ఏజెంట్లు వివిధ ప్రాంతాలలో పట్టుబడ్డారు. పాకిస్తాన్ కు కీలక సైనిక రహస్య సమాచారం చేరవేతల అభియోగాలతో ఇంటలిజెన్స్ వర్గాల నిఘాలో పట్టుబడ్డ వారిలో ట్రావెటర్ యూట్యూబర్ జ్యోతి, ఇతరులు అనేకులు ఇప్పటివరకూ అరెస్టు అయ్యారు. వారిపై ఇంటరాగేషన్ జరుగుతుంది. పాకిస్థాన్ ఇరుగు పొరుగు రాష్ట్రాలు పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ ప్రాంతాలకు చెందిన వారే ఈ పట్టుబడ్డవారిలో ఉన్నారని అధికారిక ప్రకటనలతో వెల్లడైంది. పహల్గాం ఉగ్రదాడి, తరువాత ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ఇంటలిజెన్స్ వర్గాల నిఘాలో ఈ పాకిస్తాన్ ఏజెంట్లను అరెస్టు చేశారు. పంజాబ్ నుంచి ఆరుగురు, హర్యానా నుంచి ఐదుగురు, యుపి నుంచి ఒక్కరు ఇప్పటి వరకు పట్టుబడ్డారు. అన్వేషణ కొనసాగుతున్నది. అనేక రహస్య సమాచారం వెల్లడి కావల్సి ఉంది.

# పాక్ విమానాలకు భారత గగనతలంలో మరో నెల నో ఎంట్రీ




వేద న్యూస్, డెస్క్ : భారత గగనతలంపై పాకిస్థాన్‌కు చెందిన విమానాల రాకపోకలపై విధించిన నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం మరో నెల రోజుల పాటు పొడిగించింది. భారత విమానాలకు తమ గగనతలాన్ని మూసివేస్తూ పాకిస్థాన్ తీసుకున్న నిర్ణయానికి ప్రతిగా భారత్ ఈ చర్యలు చేపట్టింది. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ఎయిర్ మెన్ కు ప్రత్యేక నోటీసు (నోటమ్) జారీ చేసింది. తాజా ఆదేశాల ప్రకారం, జూన్ 23వ తేదీ వరకు పాకిస్థాన్‌లో రిజిస్టర్ అయిన విమానాలు, పాకిస్థానీ ఎయిర్‌లైన్స్ యాజమాన్యంలోనివి, లీజుకు తీసుకున్నవి లేదా ఆపరేట్ చేస్తున్న విమానాలు, అలాగే పాక్ సైనిక విమానాలు కూడా భారత గగనతలంలోకి ప్రవేశించరాదని ఆ నోటీసులో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో ఆగ్నేయాసియా, ఆస్ట్రేలియా వంటి దేశాలకు వెళ్లే పాకిస్థాన్ విమానాలు ఇప్పుడు భారత్‌ను చుట్టి ప్రయాణించాల్సి ఉంటుంది. దీనివల్ల ప్రయాణ సమయం పెరగడమే కాకుండా, విమానయాన సంస్థలకు నిర్వహణ ఖర్చులు కూడా అధికమవుతాయి. జమ్ము కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పాకిస్థాన్ సంబంధిత ఉగ్రవాదులు జరిపిన దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన అనంతరం ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ భూభాగంలో 'ఆపరేషన్ సిందూర్' పేరిట దాడులు చేసి, ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో, ఏప్రిల్ నెలాఖరులో ఇరు దేశాలు పరస్పరం తమ గగనతలాలపై ఆంక్షలు విధిస్తూ తొలిసారిగా నోటీసులు జారీ చేసుకున్నాయి. ప్రస్తుతం ఆ నిషేధాన్ని ఇరుదేశాలు మరోసారి పొడిగించాయి.

# సిగరెట్ల కంటే ఇవి లక్షల రెట్లు ప్రమాదకరం: కేఏ పాల్

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



బెట్టింగ్ యాప్‌ల నియంత్రణ విషయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిందని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తెలిపారు. ఈ యాప్‌ల వల్ల జరుగుతున్న నష్టంపై కేంద్ర ప్రభుత్వంతో పాటు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు ఇచ్చిందని ఆయన వెల్లడించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన పాల్, బెట్టింగ్ యాప్‌ల ప్రమాదకర స్వభావంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బెట్టింగ్ యాప్‌ల వ్యసనం సమాజంలో పెను విషాదాన్ని నింపుతోందని కేఏ పాల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యాప్‌ల కారణంగా వేలాది మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన గుర్తుచేశారు. లక్షలు, కోట్ల రూపాయల అప్పుల ఊబిలో కూరుకుపోయి, వాటిని తీర్చలేక ఎంతోమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఇలాంటి దారుణమైన ఆత్మహత్యలను నివారించడానికి ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నాయో వివరించాలని సుప్రీంకోర్టు తన నోటీసుల్లో ప్రశ్నించిందని పాల్ పేర్కొన్నారు. "సిగరెట్ ప్యాకెట్లపై 'పొగతాగడం ఆరోగ్యానికి హానికరం' అని రాసి ఉంటుంది. కానీ, ఈ బెట్టింగ్ యాప్‌లు సిగరెట్ కంటే లక్షల రెట్లు ప్రమాదకరమైనవి" అని కేఏ పాల్ తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు. సుమారు 1,100 మందికి పైగా సెలబ్రిటీలు కోట్ల రూపాయలు పారితోషికంగా తీసుకుని ఈ బెట్టింగ్ యాప్‌లను విచ్చలవిడిగా ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. భవిష్యత్తులో ఇలాంటి యాప్‌ల వల్ల మరిన్ని ఆత్మహత్యలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పాల్ నొక్కిచెప్పారు. మనీలాండరింగ్ వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలంటే, కేంద్ర ప్రభుత్వం తక్షణమే బెట్టింగ్ యాప్‌లను పూర్తిగా నిషేధిస్తూ ఒక పటిష్టమైన చట్టాన్ని తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ యాప్‌లను ప్రమోట్ చేసిన కొందరు వ్యక్తులపై తెలంగాణలో కేసులు నమోదు చేసినప్పటికీ, వారిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని పాల్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

# సెన్సార్ బోర్డుపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన రామ్ గోపాల్ వర్మ



**వేద న్యూస్, డెస్క్:**

ప్రముఖ టాలీవుడ్ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. సినిమాల్లో అసభ్య పదజాలం, సెన్సార్ బోర్డు తీరుపై ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్జీవీ, పలు అంశాలపై తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వెల్లడించారు. సినిమాల్లో బూతులు ఉండకూడదని చాలా మంది వాదిస్తుంటారు. సెన్సార్ బోర్డు కూడా అనేక నిబంధనలు విధిస్తోంది. సినిమాల్లోనే ఇదంతా ఉన్నట్లు మాట్లాడుతున్నారు" అని ఆర్జీవీ అన్నారు. "ఈ రోజుల్లో ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. వాటిలో పోర్న్ వీడియోలు, అత్యంత హింసాత్మక దృశ్యాలు సులువుగా చూస్తున్నారు. అలాంటప్పుడు, వినోదం కోసం తీసే సినిమాల్లో ఇది ఉండొద్దు, అది చూపించొద్దు అనడం ఎలా సమంజసం? ఫోన్లో చూస్తే తప్పు లేనప్పుడు, పెద్ద తెరపై బూతులు చూస్తే తప్పేంటి ఇలాంటి ఆంక్షలు పెట్టడం నిజంగా అర్థం లేని పని" అని ఆయన అభిప్రాయపడ్డారు. సెన్సార్ బోర్డు పనితీరుపై మండిపడుతూ, "సెన్సార్ బోర్డ్ అనేది ఎప్పుడో కాలం చెల్లిపోయింది (ఎక్స్‌పైర్ అయిపోయింది). అదొక స్టుపిడ్ థింగ్" అంటూ ఆర్జీవీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ముక్కుసూటిగా మాట్లాడటం, వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ఆర్జీవీకి కొత్తేమీ కాదు. అయితే, ఈసారి ఏకంగా సెన్సార్ బోర్డునే ఆయన తప్పుబట్టడం గమనార్హం. ఈ వ్యాఖ్యలపై సెన్సార్ బోర్డు ఎలా స్పందిస్తుందో చూడాలి.

# ఐఫోన్లు అమెరికాలోనే తయారుకావాలి, లేదంటే 25% సుంకం

వేద న్యూస్, డెస్క్ :



అమెరికాలో విక్రయించే ఐఫోన్‌లను భారత్‌లో గానీ, మరే ఇతర దేశంలో గానీ కాకుండా అమెరికాలోనే తయారు చేయాలని, లేదంటే కనీసం 25 శాతం సుంకం చెల్లించాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆపిల్ సీఈఓ టిమ్ కుక్‌ను గట్టిగా హెచ్చరించారు. ఈ పరిణామం భారత్‌లో ఐఫోన్ల ఉత్పత్తిని పెంచాలనుకుంటున్న ఆపిల్ ప్రణాళికలకు ఆటంకం కలిగించేలా ఉంది. "అమెరికాలో అమ్ముడయ్యే ఆపిల్ ఐఫోన్లు భారత్‌లోనో, మరే ఇతర దేశంలోనో కాకుండా అమెరికాలోనే తయారు కావాలని నేను చాలా కాలం క్రితమే టిమ్ కుక్‌కు తెలియజేశాను" అని ట్రంప్ శుక్రవారం తన ట్రూత్ సోషల్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఒకవేళ అలా జరగని పక్షంలో, ఆపిల్ సంస్థ అమెరికాకు కనీసం 25 శాతం సుంకం చెల్లించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఈ వార్తల నేపథ్యంలో ప్రీమార్కెట్ ట్రేడింగ్‌లో ఐఫోన్ తయారీ సంస్థ ఆపిల్ షేర్లు 3 శాతానికి పైగా పడిపోయాయి. చైనాపై ట్రంప్ విధించిన సుంకాల నేపథ్యంలో, ఆపిల్ సంస్థ తమ సరఫరా వ్యవస్థలను సర్దుబాటు చేసుకుంటూ ఐఫోన్ తయారీని భారత్‌కు మార్చాలని చూస్తోంది. ఈ ప్రణాళికే అమెరికా అధ్యక్షుడికి తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. గతవారం తన మధ్యప్రాచ్య పర్యటన సందర్భంగా కూడా ట్రంప్ ఈ విషయాన్ని ప్రస్తావించారు. "నిన్న నాకు టిమ్ కుక్‌తో చిన్న సమస్య వచ్చింది. ఆయన భారత్‌లో భారీగా ఉత్పత్తి చేస్తున్నారు. మీరు భారత్‌లో ఉత్పత్తి చేయడం నాకు ఇష్టం లేదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. తమ చర్చల ఫలితంగా, ఆపిల్ అమెరికాలో ఉత్పత్తిని పెంచుతుందని ట్రంప్ తెలిపారు.

ట్రంప్ తాజా వ్యాఖ్యలు, సుంకాలు మరియు భౌగోళిక రాజకీయ ఆందోళనల నేపథ్యంలో చైనాపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు వచ్చే ఏడాది చివరి నాటికి అమెరికాకు అవసరమైన ఐఫోన్లలో అధిక భాగాన్ని భారత్ నుంచి సేకరించాలన్న ఆపిల్ ప్రణాళికకు అడ్డంకిగా మారాయి. ఆపిల్ ప్రస్తుతం చాలా వరకు ఐఫోన్‌లను చైనాలోనే తయారు చేస్తోంది. అమెరికాలో స్మార్ట్‌ఫోన్ల ఉత్పత్తిని చేపట్టడం లేదు. కఠినమైన కోవిడ్ లాక్‌డౌన్‌ల కారణంగా తమ అతిపెద్ద ప్లాంట్‌లో ఉత్పత్తిని దెబ్బతిన్నప్పటి నుంచి ఆపిల్, దాని సరఫరాదారులు ప్రపంచంలోని రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన చైనా నుంచి తమ కార్యకలాపాలను వేగంగా తరలిస్తున్నారు. భారత్‌లో తయారవుతున్న ఐఫోన్లలో ఎక్కువ భాగం దక్షిణ భారతదేశంలోని ఫాక్స్‌కాన్ టెక్నాలజీ గ్రూప్ ఫ్యాక్టరీలో అసెంబుల్ అవుతున్నాయి. విస్ట్రాన్ కార్పొరేషన్ స్థానిక వ్యాపారాన్ని కొనుగోలు చేసి, పెగాట్రాన్ కార్పొరేషన్ కార్యకలాపాలను నిర్వహిస్తున్న టాటా గ్రూప్ ఎలక్ట్రానిక్స్ తయారీ విభాగం కూడా కీలక సరఫరాదారుగా ఉంది. టాటా, ఫాక్స్‌కాన్ సంస్థలు దక్షిణ భారతదేశంలో కొత్త ప్లాంట్లను నిర్మిస్తూ, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతున్నాయని బ్లూమ్‌బెర్గ్ న్యూస్ గతంలో నివేదించింది.

మార్చి వరకు గత 12 నెలల్లో ఆపిల్ భారత్‌లో 22 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్‌లను అసెంబుల్ చేసింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఉత్పత్తిని దాదాపు 60 శాతం పెంచింది. ట్రంప్ తాజా హెచ్చరికలతో ఆపిల్ భవిష్యత్ వ్యూహాలు ఎలా మారతాయో చూడాలి.

# ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం



**వేద న్యూస్, డెస్క్:**

ఏపీలోని ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన ఒక లారీ, కారును బలంగా ఢీకొన్న ఘటనలో ఆరుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనలో మరో ఇద్దరు గాయపడగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. జిల్లాలోని కొమరోలు మండలం తాటిచెర్లమోటు సమీపంలో ఈ విషాదకర సంఘటన జరిగింది. బాధితులంతా నంద్యాల జిల్లాలోని మహానంది క్షేత్రాన్ని దర్శించుకుని తిరిగి తమ స్వస్థలానికి వెళుతుండగా ఈ ప్రమాదం బారిన పడ్డారు.బాపట్ల జిల్లా స్టువర్టుపురం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు మహానంది దర్శనం కోసం కారులో వెళ్లారు. దైవదర్శనం ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో, ప్రకాశం జిల్లా కొమరోలు మండలం తాటిచెర్లమోటు వద్దకు రాగానే, ఎదురుగా వేగంగా వస్తున్న లారీ వీరి కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు కారు నుజ్జునుజ్జు అయింది. ప్రమాదంలో గజ్జల అంకాలు (50), గజ్జల జనార్ధన్, గజ్జల భవాని (20), గజ్జల నరసింహ (20), సన్నీ అక్కడికక్కడే మృతి చెందారు. మరణించిన వారిలో మరొకరి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. గాయపడిన వారిని జీతన్, శిరీషగా గుర్తించారు. వీరిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

వేద న్యూస్

శనివారం మే 24, 2025



## చిన్నారులను ఆశీర్వదించిన తహసిల్దార్

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

మిర్యాలగూడ పట్టణంలో శుక్రవారం పివిఆర్ గార్డెన్లో జరిగిన మిర్యాలగూడ పట్టణానికి చెందిన తహసిల్దార్ కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ వేము జైపాల్ రెడ్డి – శ్రీ స్వాతి కూతురు కుమారుడు నేహా రెడ్డి –చరణ్ రెడ్డి నూతన పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమానికి వేముల పల్లి తహసిల్దార్ హేమలత పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చిన్నారులు నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. చదువుల్లో రాణించి తల్లిదండ్రుల కలలను సహకారం చేయాలని కోరారు.తహసిల్దార్ వెంట నాయబ్ తహసిల్దార్ కోటేశ్వరి,రెవిన్యూ ఇన్స్పెక్టర్ మహేందర్ రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్లు హర్ష,గణేష్, మీసేవ నిర్వాహకులు రాము ఉన్నారు.




## నేత్రదానం మహాదానం

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

వరంగల్ నగరంలోని బట్టల బజార్ నివాసి పోలా గౌరీ శంకర్ (89) అనా రోగ్య సమస్యలతో మరణిం చగా,వారి కుమారులు లక్ష్మణరావు, మధుసూదన్ వారి అల్లుడు ఉమాపతి సమాజ హితం కోరి నేత్రదానం చేయడానికి అంగీకరించారు. తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ వరంగల్ అధ్యక్షులు మల్లారెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఎల్వీ ప్రసాద్ నేత్ర సేకరణ టెక్నీషియన్ లక్ష్మణ్ ద్వారా నేత్రదానం కార్నియా సేకరణ చేశారు. గౌరీశంకర్ నేత్రదానంతో ఇద్దరి అందులకు చూపునిచ్చిన వారయ్యారని కుటుంబ సభ్యులకు ధన్యవాద ములు తెలిపి నేత్రదాన సర్టిఫికెట్ అందజేశారు. మరణానంతరం నేత్ర దానం చేసి ఇద్దరి అందులకు చూపునిద్దాం.. నేత్ర వైద్య విద్యకు తోడ్ప డుదాం సామాజిక బాధ్యత నెరవేర్చుకుందాం అని అసోసియేషన్ ప్రతినిదులు అన్నారు. 8790548706, 9490133650 నెంబర్లను సంబరాధించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కోన్ రెడ్డి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆడెపు రాజేంద్ర ప్రసాద్, లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, రాజు పాల్గొన్నారు.

## ఆదర్శనీయమైన రక్తదాత దంపతులు

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



మిర్యాలగూడ పట్టణంలో ఒక అరుదైన సంఘటన చోటుచేసుకుంది. తిప్పర్తి మండలం ఇండ్లూరు గ్రామానికి చెందిన రఘు దంపతుల పెళ్ళి రోజు సందర్భంగా శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని జ్యోతి బ్లడ్ బ్యాంక్ లో రక్తదానం చేయడం జరిగింది.సాధారణంగా మహిళలు రక్తదానం చేయడానికి ఎక్కువ శాతం వెనకడుగు వేస్తుం టారు. జ్యోతి ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రంలో ల్యాబ్ ఇంచార్జీగా పనిచేసే రఘు మాట్లాడుతూ మహిళలు కూడా రక్తదానం చేయాలని, అందరికీ ఆదర్శంగా ఉండాలనే ఉద్దేశ్యంతో తన భార్యతో రక్తదానం చేయిస్తున్నానని,ఆమెకు ధైర్యంగా ఉండడం కోసం నేను కూడా తనతో పాటు రక్తదానం చేశానని చెప్పారు.ఈ విషయం తెలిసిన పలువురు ప్రముఖులు,రక్తదాతలు రఘు,జ్యోతి దంపతులను అభినందించారు.



## డప్పు,చెప్పు,చర్మకారులకు రూ.5000 పెన్షన్ ఇవ్వాలి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి:**

డబ్బు,చెప్పులు కుట్టుకునే, చర్మకారులకు ఐదువేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్‌తో వాల్ పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగింది.మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ మాదిగ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్),ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ ల చేతుల మీదుగా ఈ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాదిగ సంఘాల నాయకులు మాట్లాడుతూ తరతరాలుగా డప్పు కొడుతూ, చెప్పు లు కుడుతూ ఎంతోమంది జీవనం కొనసాగిస్తున్నారని,ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని,వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని అన్నారు. ఈ సందర్భంగా డప్పు, చెప్పు,చర్మకారులకు 5000 రూపాయలు పెన్షన్ ప్రభుత్వం ద్వారా ఇప్పించడానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి స్కైలాబ్ నాయక్,సిద్దు నాయక్,తెలంగాణ మాదిగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు నందిపాటి ప్రభాకర్,రాష్ట్ర ఉపాధ్యక్షులు మంద శ్రీనివాస్,రాష్ట్ర కార్యదర్శి పెదమం వీరన్న, తెలంగాణ మాదిగహక్కులపోరాట సమితి గౌరవ సలహాదారులు వెల్లంల శంకర్ యాదవ్,సంగం జగదీష్ నేత తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే పీడియాక్ట్

- **కమలాపూర్ ఇన్స్పెక్టర్ హరికృష్ణ**

**వేద న్యూస్, కమలాపూర్ :**



వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్, ఎరువులకు సంబంధించిన షాపులను, గోదాములన్నిటిని వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ తో కలిసి కమలాపూర్ ఇన్స్పెక్టర్ హరికృష్ణ తనిఖీ చేశారు. షాప్ కు సంబంధించిన స్టాక్ రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్, బిల్ బుక్ తదితర రికార్డులన్నింటిని పరిశీలించారు. అనంతరం ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ కాలం చెల్లిన పెస్టిసైడ్స్ కానీ ఎరువులు కానీ ఎట్టి పరిస్థితుల్లో రైతులకు విక్రయించకూడదని, రైతులకు సీడ్ విత్తనాలు విక్రయించే షాపు యజమానులు అవి సరైనవో కావో ముందుగానే పరిశీలించుకుని రైతులకు మంచి విత్తనాలు మాత్రమే అందించాలని, ఒకవేళ నకిలీ విత్తనాలు విక్రయిస్తే మాత్రం షాపు యజమాని పై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే ఊర్లలో గన్ని సంచులలో నకిలీ విత్తనాలు తీసుకొచ్చి అమ్మే వారిపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, అలాంటివారు అగుపడితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సర్టిఫైడ్ షాపుల్లోనే రైతులంతా విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసినప్పుడు తప్పకుండా రశీదు తీసుకోవాలని దానిని భద్రంగా దాచి పెట్టుకోవాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా మాత్రమే షాపులను నడిపించుకోవాలని యజమానులకు హితవు పలికారు. షాపు యజమానులు ఒకవేళ నకిలీ విత్తనాలు అమ్మినట్లయితే రైతులు ఎవరైనా పోలీస్ స్టేషన్ కు నేరుగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చని లేకుంటే డయల్ 100 కు అయిన ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లు గాని, కాలం చెల్లిన పురుగుమందులు, ఎరువులు అమ్మినట్లు నిర్ధారణ అయితే మాత్రం షాపును సీజ్ చేసి సంబంధిత షాపు యజమానులపై పీడీ యాక్ట్ నమోదు చేయడానికి కూడా వెనకాడబోమని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## ఈ నెల25న కోటి బీసీ సభ్యత్వాల నమోదు కార్యక్రమం

**వేద న్యూస్, హైదరాబాద్ :**



తెలంగాణలో బీసీల సమైక్యతను, సంఘటిత శక్తిని పెంపొందించే దిశగా మే 25న ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్‌లో బీసీల కోటి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ రాజ్యాధికార సాధన కోసం మొదటి విడతగా పది లక్షల మంది కార్యకర్తల సభ్యత్వ నమోదును జూన్ మాసంలో పూర్తి చేయనున్నామన్నారు. గ్రామ,వార్డు,మండల,బస్తీ,పట్టణ ,నియోజకవర్గ, జిల్లాస్థాయి వారీగా సభ్యత్వాల నమోదు కొనసాగునున్నదనీ తదనంతరం పటిష్ట కమిటీల నిర్మాణం చేపట్టనున్నామని తెలిపారు. 15 సంవత్సరాలు పైబడిన ప్రతీ బీసీ బిడ్డకు సభ్యత్వ నమోదు అందుబాటులో ఉందనున్నదనీ, ఆన్లైన్లో కూడా సభ్యత్వ నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించనున్నామని దాసు సురేశ్ పేర్కొన్నారు. క్రియాశీలక నాయకులకు ఇన్సూరెన్స్ సదుపాయాన్ని కల్పించనున్నామనీ బీసీలకు నాయకత్వం చేపట్టాలనే ఆసక్తి కలిగిన యువ నాయకులకు,మహిళలకు అన్ని కమిటీలలో అధిక ప్రాధాన్యత కల్పించనున్నామన్నారు. ఆదివారం హైద్రాబాద్లో ప్రారంభమవ్వనున్న కోటి సభ్యత్వాల నమోదు కార్యక్రమానికి బీసీ నాయకులు, ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరు కానున్నారనీ, క్షేత్రస్థాయి బీసీ నాయకులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కార్యోన్ముఖులుగా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## ఉద్యానవన సాగును విస్తృతంగా అభివృద్ధి చేయాలి

**మొదటి పేజీ తరువాయి**

వార్షిక ప్రణాళికను ఆమోదించడం జరిగిందన్నారు. ఇందులో ముఖ్యంగా ఆయిల్ ఫామ్ సాగు పండ్లతోటలతో మల్చింగ్, బిందు సేద్యం, స్టేట్ వెదురు మిషన్ వంటి పథకాలకు ఉద్యానవన శాఖ అందిస్తుందని ఇట్టి రాయితీలను ఉత్సాహవంతులైన రైతులకు అందించి హార్టికల్చర్ సేద్యం పెంచేందుకు కృషి చేయాలని హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వ్యవసాయాన్ని ఆధునీకరించి, రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా ఉద్యానవన సాగును విస్తృతంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ డాక్ పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుత హార్టికల్చర్ పంటల విస్తీర్ణాన్ని 32 వేల ఎకరాలనుండి 50 వేల ఎకరాలకు పెంచేందుకు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ సంబంధిత ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. ఉద్యానవన సాగు ప్రాధాన్యత అంశాలను వివరిస్తూ హార్టికల్చర్ పంటలు (పండ్లు, కూరగాయలు, పూలు, మందుల మొక్కలు) సాంప్రదాయ పంటల కంటే ఎక్కువ ఆదాయం వచ్చే పంటలను ఎంపిక చేసుకోవాల్సిందిగా సూచించారు. తక్కువ నీటి వినియోగంతో అధిక ఉత్పత్తిని సాధించ వచ్చునని, మార్కెట్ డిమాండ్ ఉన్న విలువైన పంటల సాగుతో రైతులకు స్థిర ఆదాయం లభిస్తుందని అన్నారు. పంట వైవిధ్యీకరణ పంటలు రైతులు కేవలం ధాన్యం, పత్తి వంటి పంటలకే పరిమితమవకుండా పండ్లు (మామిడి, సీతాఫలం, బొప్పాయ, అరటి, డ్రాగన్ ఫ్రూట్), తదితర పంటలే కాకుండా కూరగాయలు సాగు చేయాలని సూచించారు. మైక్రో ఇరిగేషన్ పద్ధతుల వినియోగం పై వివరిస్తూ నీటి వినియోగాన్ని తగ్గించేందుకు డ్రిప్ మరియు స్ప్రింక్లర్లు,పద్ధతులను ప్రోత్సహించాలని అన్నారు. పరిశ్రమ అనుసంధానం విషయానికి వస్తె ఉత్పత్తి అయిన పంటలకు ధర లభించేలా ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్‌లు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేలా మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. నాణ్యమైన మొక్కల నర్సరీలను ఏర్పాటుచేసి, రైతులకు సరైన సమయంలో మొక్కల పంపిణీ చేపట్టాలని సూచించారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పండించే వివిధ పంటల వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించడమైనది. నాబార్డ్ ఏజీఎం రవి, కెవికె మామునూర్ శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న, సిహెచ్ రాకేష్ ,జ్యోతి, తరుణ్ ,అరుణ, తిరుపతిలతో పాటు రైతులు దేవేందర్ కుమార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కేంద్రంతో కలిసి పని చేస్తా..

**మొదటి పేజీ తరువాయి**

మెదక్ లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిథ్యం వహిస్తూ చేసిన అనేకానేక అభివృద్ధి కార్యక్రమాలు, ఈ జిల్లాతో ఉన్న విడదీయలేని అనుబంధాన్ని వివరించారు. ఇందిరాగాంధీ స్ఫూర్తితో ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తోందని చెప్పారు. ప్రభుత్వం రైతు, మహిళా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని..రుణ విముక్తులను చేయడానికి రైతులకు రుణమాఫీ, పెట్టుబడి సహాయం కింద రైతు భరోసాను 10 నుంచి 12 వేలకు పెంపు, మద్దతు ధరతో పాటు ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లింపు, భూమిలేని వ్యవసాయ నిరుపేదలకు రూ.12 వేల చొప్పున సహాయం అందిస్తున్న విషయాలను వివరించారు. మహిళల కోసం ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం, పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500 లకే వంట గ్యాస్ సిలిండర్ అందించడంతో పాటు రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో ఇప్పటివరకు తీసుకున్న చర్యలను వివరంగా తెలియజేశారు. వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యాన్ని చేరుకోవడానికి నిర్దేశించుకున్న కార్యక్రమాలను విశదీకరించారు. జహీరాబాద్ పస్తాపూర్‌లో ఏర్పాటు చేసిన సభలో పాల్గొనడానికి ముందు ముఖ్యమంత్రి స్వయం సహాయక సంఘాలకు కేటాయించిన పెట్రోల్ పంపును ప్రారంభించారు. అక్కడే మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి వారి ఉత్పత్తులను పరిశీలించారు. సభా వేదికగా సంగారెడ్డి జిల్లా మహిళా సమాఖ్యకు బ్యాంకు లింకేజీ కింద రూ.126.54 కోట్లు, మెప్మా కింద 17.51 కోట్లకు సంబంధించి చెక్కును అందజేశారు. జిల్లాలో రూ. 494.67 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులతో పాటు లోక్‌సభ సభ్యులు సురేష్ షెట్కర్, సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, మహమ్మద్ అలీ షబ్బీర్, ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పోలీసు కమిషనర్ గారు.. న్యాయం చేయండి

- **శ్రీరాముల శ్రావణ్ కుమార్**

**వేద న్యూస్, హన్మకొండ :**



ఓ కానిస్టేబుల్ తనని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని తనకు న్యాయం చేయాలంటూ పోలీస్ శాఖ ఉన్నత అధికారులను అడ్వకేట్ శ్రీరాముల శ్రావణ్ కుమార్ వేడుకుంటున్నాడు. పూర్తి వివరాలోకెళ్తే.. శ్రీరాముల శ్రావణ్ కుమార్ (అడ్వకేట్) తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాముల శ్రావణ్ కుమార్ హన్మకొండ లోనీ టీఎన్జీఓస్ కాలనీలోని ఓ పోలీస్ అధికారి ఇంట్లో గత కొన్ని నెలలుగా అద్దెకు నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో వారిని తక్షణమే ఇల్లు కాలి చేయాలని కింది సిబ్బంది చేత ఇబ్బందులు పెడుతూ, తాను ఇంట్లో లేని సమయంలో తన భార్య పిల్లలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని శ్రావణ్ కుమార్ ఆరోపించారు. తన భార్య పైన దౌర్జన్యానికి దిగారని, బలవంతంగా మనుషులను పెట్టి ఇంట్లోని సామాన్లు బయట పడేసారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని సార్లు సంబంధిత సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని, ఇబ్బందులకు గురిచేసేవారు పోలీస్ శాఖకు చెందినవారు అవడంతో ఇచ్చిన ఫిర్యాదును పోలీసులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితుడు శ్రీరాముల శ్రావణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. నగర పోలీసు కమిషనర్ చొరవ తీసుకొని న్యాయం చేయాలని బాదితుడు కోరారు. అడ్వకేట్ నైన తననే ఇబ్బందులకు గురిచేస్తున్న పోలీసులు. ఇక సామాన్య బాధిత ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో అని ఆలోచించాల్సిన అవసరం ఉందని అన్నారు.

## అక్రమ ఇసుక ట్రాక్టర్లు పట్టివేత..!

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ మండల పరిధిలోని తక్కెళ్లపాడు,కాల్వపల్లి గ్రామ శివారులలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు అనే సమాచారం మేరకు తక్కెళ్లపాడు, కాల్వపల్లి గ్రామ శివారులలో పెట్రోలింగ్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. రెండు ట్రాక్టర్లలో ఇసుక నింపుకొని వస్తూ పోలీస్ వారిని చూసి ట్రాక్టర్ డ్రైవర్ లు ట్రాక్టర్ల ను వదిలి పారిపోయారు. దీంతో దర్యాప్తు చేసిన పోలీసులు ట్రాక్టర్ యాజమానులు అయిన తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన చౌగాని దశరథ,కాల్వపల్లి గ్రామానికి చెందిన గోవిందు శ్రీనివాస్ లపై కేసు నమోదు చేయడం జరిగిందనీ ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్ కు తరలించామని మిర్యాలగూడ రూరల్ ఎస్సై లక్ష్మయ్య తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఖాకీల అదుపులో మోసగాడు

**మొదటి పేజీ తరువాయి**

'కలెక్టర్ సంతకం ఫోర్జరీ' అనే శీర్షికతో వార్తను ప్రచురితం చేసింది. దీంతో స్పందించిన కలెక్టర్ అధికారులను ఆదేశించి సుబేదారి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు నిరుద్యోగులను మోసం చేసిన మోసగాడిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆ మోసగాడి చేతిలో ఎంతమంది నిరుద్యోగులు బలయ్యారు..ఎంత మొత్తంలో డబ్బులు వసూలు చేశాడు..అనే పూర్తి వివరాలు తెలియాలంటే పోలీసులు అధికారికంగా వెల్లడిస్తే కానీ తెలిసేలా లేదు.

ఇదిలా ఉంటే ఇంటిలిజెన్స్ సైతం ఈ ఘటనపై పూర్తి సమాచారం సేకరణలో ఉన్నట్టు తెలుస్తోంది. ఇలాంటి మోసగాలు నగరంలో ఇంకా ఎంతమంది ఉన్నారు.. ఎక్కడ ఉన్నారు..వారి చేతిలో ఎంతమంది మోసపోయారు అని కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

## మూడు నెలల బియ్యం పంపిణీకి సిద్ధం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రత్యేక ప్రతినిధి :**




కేంద్ర ప్రభుత్వం జూన్ మాసంలో వర్షాలు ఎక్కువ ఉండడంతో ఒకేసారి మూడు నెలల బియ్యం లబ్ధిదారులకు అందించాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది.కాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కసరత్తులు మొదలుపెట్టింది. మూడు నెలల బియ్యం ఒకేసారి జూన్ మాసంలో ఇవ్వాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం ద్వారా తెలుస్తుంది. అయితే రేషన్ లబ్ధిదారులకు పంపిణీకి స్వాగతిస్తున్నామని రాష్ట్ర అధ్యక్షులు నాయకోటి రాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది ఇలాగా ఉండగా రేషన్ డీలర్ల ఆర్థిక పరిస్థితి అగమ్య గోచకారంగా మారడంతో మూడు నెలల కమిషన్‌ను ముందస్తుగా విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అంతేకాకుండా ఎంఎల ఎస్ పాయింట్లు నుండి తరలింపు ప్రక్రియలో అవకతవకలు జరగకుండా వే బ్రిడ్జి ద్వారా సరైన తూకాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్లు నుండి డీలర్ల వేలిముద్రలను ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073